గిరిజనబస్తీలో ఇందిరమ్మ ఇళ్లు

- కసరత్తు ప్రారంభించిన హౌసింగ్ బోర్డు, రెవెన్యూ అధికారులు
- ఇప్పటికే సర్వే పూర్తి
- 25 ఏళ్లుగా గుడిసెల్లోనే గురుబ్రహ్మనగర్ వాసులు

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): వారంతా గిరిజనులు.. వివిధ జిల్లాల నుంచి కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వలసొచ్చారు. గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారికి గత పాలకులు సొంత ఇళ్లు కట్టిస్తామని మాట ఇచ్చారు. అన్నట్టుగా పనులకు శంకుస్థాపన చేశారు. కానీ, అవి పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. శిథిలాల మధ్య గుడిసెలు వేసుకొని డబుల్ బెడ్‌రూంపై ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశ నెరవేరలేదు. ఇటీవల వివాదాలతో వెలుగులోకి వచ్చిన బస్తీలో ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే హౌసింగ్‌బోర్డు అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే కూడా పూర్తి చేశారు. ఏళ్ల తరబడి ఇళ్ల కోసం నిరీక్షిస్తున్న బస్తీవాసుల్లో కొంత ఆనందం నెలకొంది.


గురుబ్రహ్మనగర్‌లో గుడిసెలు


సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, హౌసింగ్‌బోర్డు అధికారులు

25 ఏళ్ల కిందట ఏర్పాటు

జూబ్లీహిల్స్ డివిజన్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ 25 సంవత్సరాల క్రితం ఏర్పడింది. దాదాపు 220 మంది గిరిజనులు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి పక్కా గృహాలు నిర్మించి ఇస్తామంటూ హామీ ఇచ్చింది. ఈ మేరకు అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో చాలీచాలని గుడిసెల్లోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నెల రోజులకే ఆగిన నిర్మాణాలు..

నెల రోజులపాటు పనులు నిర్వహించాక కోర్టు కేసులు ఉన్నాయంటూ అధికారులు పనులు ఆపేశారు. స్థలం తమదేనంటూ కొంతమంది ధనవంతులు కోర్టుకు వెళ్లారు. కానీ, అది చెల్లలేదు. అప్పటి పాలకులు మాత్రం నిర్మాణాలు కొనసాగించవద్దని నిశ్చయించుకున్నారు. దీంతో పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. గత ప్రభుత్వం బస్తీలో డబుల్ బెడ్‌రూంల నిర్మాణం చేపడతామని ప్రకటించింది. కానీ ఆ దిశగా ముందుకు వెళ్లలేదు. కాగా, ఆరు నెలల క్రితం నందగిరిహిల్స్, గురుబ్రహ్మనగర్ మధ్య ఉన్న పార్కు స్థలం విషయంలో వివాదం నెలకొంది. హైడ్రా ఇక్కడ కూల్చివేతలు నిర్వహించింది. దీంతో గురుబ్రహ్మనగర్ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎలాగైనా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గురుబ్రహ్మనగర్ అంశం కూడా పరిగణలోకి తీసుకుంది. బస్తీలో ఎంత స్థలం ఉంది.. ఎన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే అంశంపై అధ్యయనం చేయాలని హౌసింగ్ బోర్డు అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం హౌసింగ్ బోర్డు అధికారులు సర్వే పూర్తి చేసి నివేదిక రూపొందించారు.

సదుపాయాలు లేకున్నా.. బతికేస్తున్నాం



బస్తీలో పిల్లర్లు తీసిన ప్రాంతంలో చాలీచాలనీ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నాం. కనీసం నడిచేందుకు కూడా దారి లేదు. మంచినీరు సరిపోవడం లేదు. ఇంకా ఎన్ని రోజులు ఇలా బతకాలో తెలియడం లేదు. పక్కా గృహాల పేరుతో ఉన్న ఇళ్లను అప్పటి పాలకులు కూల్చివేశారు. కొత్త ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఇప్పటికైనా మా బతుకులు మారితే బాగుంటుంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడితే మా బతుకులు మారుతాయి.

● ఎన్.దెవాలిబాయి, బస్తీవాస్తవ్యురాలు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలి



ప్రభుత్వం మా ఇబ్బందులు తెలుసుకొని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. బస్తీలో నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు వివరించాం. పాలకులు సానుకూలంగా స్పందిస్తున్నారు. వారి బస్తీపై దృష్టి పెడితే నిర్మాణాలు పూర్తవుతాయని ఆశ ఉంది. ప్రస్తుతానికి సర్వే పూర్తి చేశారు. గిరిజనులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలి.

● గోపాల్‌నాయక్, బస్తీ అధ్యక్షుడు

గిరిజనులకు సొంతింటి వసతి ఉండొద్దా



గిరిజనులంటే అందరికీ చులకన. ధనవంతులు ఉండే కాలనీ పక్కనే మేము ఉండకూడదని ఆటంకాలు సృష్టిస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. గిరిజనులుగా దేవుడు పుట్టిస్తే మేమేం చేస్తాం. 25 సంవత్సరాలుగా బస్తీని నమ్ముకొని ఉంటున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం క్రమబద్ధీకరణ చేసినా బాగుండేది. ఏదీ కాలేదు. చాలీచాలని గుడిసెల్లోనే కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొంది.

● కవితాబాయి, బస్తీవాస్తవ్యురాలు

కేటీఆర్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారు

● గజ్జెల కాంతం


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పంజాగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం అన్నారు. కేటీఆర్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పథకాల పేరుతో స్కామ్‌లు చేసిందని, రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పులో ముంచి కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల ఆస్తులు సంపాదించిందని, వేల ఎకరాల భూములు స్వాహా చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలు, స్కామ్‌లు, ఫోన్ ట్యాపింగ్ లపై విచారణ జరుపుతోందని, తమను ఎక్కడ జైలుకు పంపుతారో అనే భయంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణను అప్పుల పాలు చేసింది గత ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నీతి, నిజాయితీగా పాలన చేస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని, కేసీఆర్, కేటీఆర్‌లను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

రాష్ట్రంలో పికెల్‌బాల్ అభివృద్ధికి కార్యాచరణ


డబ్ల్యూపీఎల్ ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రాష్ట్రంలో పికెల్‌బాల్ అభివృద్ధికి వరల్డ్ పికెల్‌బాల్ లీగ్, హైదరాబాద్ సూపర్ స్టార్స్ జట్టుతో కలిసి పనిచేస్తామని అమెచ్యూర్ తెలంగాణ పికెల్‌బాల్ సంఘం ప్రకటించింది. గురువారం డబ్ల్యూపీబీఎల్ ప్రతినిధులతో రాష్ట్ర పికెల్‌బాల్ సంఘం సమావేశమైంది. రాష్ట్రంలో టాలెంట్ హంట్ నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై డబ్ల్యూపీఎల్, హైదరాబాద్ జట్టు సహకారమందించనున్నాయి. పికెల్‌బాల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ను నియమించినట్టు రాష్ట్ర పికెల్‌బాల్ సంఘం కార్యదర్శి జగన్‌మోహన్‌గౌడ్ తెలిపారు.

బీజేపీ నాయకురాలికి బెదిరింపు కాల్

యూసుఫ్‌గూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా నాయకురాలికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తూ, అసభ్యకర నీలి చిత్రాలను పంపించారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే బీజేపీ మహిళా నాయకురాలికి ఈనెల 6న 8300521578 నెంబర్ నుంచి ఫోన్ చేసి రవిగా పరిచయం చేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ అని కట్ చేసింది. తిరిగి 7న 6399691813, 9492476740 నంబర్లతో ఫోన్ చేసి అసభ్యకరమైన నీలి చిత్రాలను పంపించారు. ఇంటికి వస్తాం అంటూ బెదిరింపులకు దిగడంతో ఆ నాయకురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

బేగంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. బేగంపేట ప్రధాన రహదారిలోని కోచర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తన సిబ్బందితో బుధవారం రాత్రి దాడి చేశారు. విషయం తెలుసుకున్న వ్యభిచార కేంద్రం నిర్వాహకులు బాలాజీ, అవినాష్, రాజు, శ్రావణి పరారయ్యారు. వ్యభిచార కేంద్రంలో పలు ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువతులతోపాటు విటుడిగా వచ్చిన సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇద్దరు పాతనేరస్థులు అరెస్ట్

● జైలుకు వెళ్లి వచ్చి సెల్‌ఫోన్లు చోరీ

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరు తాళం వేసి ఉన్న ఇళ్లలో ఆభరణాల చోరీలకు అలవాటు పడ్డారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా వారిలో మార్పు రాలేదు. ఇటీవల ప్రయాణికుల చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లను లక్ష్యంగా చేసుకొని స్నాచింగ్ చేస్తూ పోలీసులకు చిక్కారు. సెల్‌ఫోన్ చోరీ చేస్తున్న ఇద్దరు పాతనేరస్థులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులు పెరిగిపోయాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలించారు. పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. ఓ కెమెరాలో ఇద్దరు ముఖాలు కనిపించాయి. వాటిని పోలీసు రికార్డులతో పోల్చగా నిందితులు అఫాపురాకు చెందిన నసీర్‌ఖాన్ అలియాస్ నజీర్, మల్లేపల్లికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అలియాస్ అర్బాజ్ అని తేలింది. వారిద్దరిని అదుపులోకి తీసుకొని ఐదు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, నజీర్‌పై మూడు కమిషనరేట్ల పరిధిలో 16 కేసులు నమోదయ్యాయి. ఇర్ఫాన్‌పై ఆరు కేసులు నమోదయ్యాయి. ఇద్దరికీ జైల్లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కలిసి చోరీలు చేయడం మొదలు పెట్టారని జూబ్లీహిల్స్ డీఐ ఆర్.మధుసూదన్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

రిపేర్ కోసం ఇచ్చిన ద్విచక్రవాహనం మాయం

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): రిపేర్ కోసం ఇచ్చిన ద్విచక్ర వాహనం మాయమైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.12 ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉండే కృష్ణపిత్తల భరత్ కారు వాషింగ్ చేస్తుంటాడు. ఈనెల 2న తన ద్విచక్ర వాహనాన్ని రిపేర్ కోసం స్థానికంగా ఉండే హనీఫ్ అనే మెకానిక్‌కు ఇచ్చాడు. రెండు రోజులు అయ్యాక హనీఫ్ ఫోన్ చేసి వాహనం కనిపించడం లేదని చెప్పాడు. వెంటనే అక్కడకు చేరుకున్న కృష్ణ అన్నిచోట్లా వెతికాడు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా ఉడాయింపు

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా ఉడాయించిన యువకులపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.3లోని పెట్రోల్ బంక్‌కు ఈనెల 7న ఇద్దరు యువకులు కేటీఎం వాహనంపై వచ్చారు. వెయ్యి రూపాయల పెట్రోల్ పోయించుకున్నారు. డబ్బులు ఇవ్వకుండా వేగంగా వెళ్లిపోయారు. పెట్రోల్ బంక్ ఉద్యోగి అనికెత్‌కుమార్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాపులో ఎలక్ట్రానిక్ సిగరెట్ల అమ్మకం

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): పాన్‌షాపులో ఎలక్ట్రానిక్ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. టోలిచౌకికి చెందిన తాహెర్ అలీ బేగ్ స్థానికంగా పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా నిషేధిత ఎలక్ట్రానిక్ సిగరెట్లను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు దాడులు నిర్వహించి తాహెర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఎలక్ట్రానిక్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వాసవీమాత జన్మదిన వేడుకలో భక్తులు

ఘనంగా వాసవీమాత జన్మదినం

యూసుఫ్‌గూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య సంఘం, ఆలయ ట్రస్టీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణానగర్‌లోని రాఘవ రెసిడెన్షియల్‌లో శ్రీ వాసవీ మాత జన్మదినం సందర్భంగా గురువారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ చైర్మన్ పరుచూరి ఎల్‌వీ సుదర్శన్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నూతన అధ్యక్షుడు వి.వెంకటేష్, ప్రధానకార్యదర్శి కె.సుధాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా(బడా గణేశ్) వద్ద ఖైరతాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన శ్రీ వాసవీ మాత జన్మదిన వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి, నిర్వాహకులు

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

మానసిక ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

ఎర్రగడ్డ, మే 8 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, యూనియన్ నాయకులు గురువారం ఆస్పత్రి వద్ద ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాపర్తి అశోక్ మాట్లాడుతూ అన్ని ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయంతోపాటు కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు కార్మిక సంఘాలన్నీ కదలి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఉద్యోగులు పిట్టల లింగయ్య, ఎస్.సైదయ్య, ఓంప్రకాష్, శ్రీధర్, లక్ష్మి, బిక్షపతి, ఎస్.లింగయ్య పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు



ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా ఖైరతాబాద్ టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో టీజీఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు, సిబ్బంది జాతీయ జెండాలు చేతబట్టుకొని మద్దతు పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సాయిబాబా, నర్సింహులు, నందకుమార్, చీఫ్ ఇంజనీర్లు చక్రపాణి, బిక్షపతి, ఎస్‌ఈలు వెంకన్న, గోపయ్య, కరుణాకర్‌బాబు, సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డా.బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు నిర్వహించిన భారీ ర్యాలీకి పెద్దసంఖ్యలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజనీర్లు, సిబ్బంది తరలివెళ్లారు.

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

త్వరలో మున్నూరుకాపు మహాసభ పూర్తిస్థాయి కమిటీలు

బర్కత్‌పుర, మే 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో మున్నూరుకాపు మహాసభ పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ నూతన అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్ తెలిపారు. మహాసభకు మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గురువారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో శ్రీనివాస్‌ను మహిళా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాకు కార్యవర్గంలో ప్రాతినిధ్యం కల్పిస్తామని ఆయన చెప్పారు. మున్నూరుకాపులకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహాసభ మహిళా ప్రతినిధులు చామకూరి సుజాత, నందిగామ అన్నపూర్ణ, జ్యోతి, రచన, సృజన పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న గోపాల్

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు గోపాల్ డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డికి 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురు వారం వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నా, జనరల్ సెక్రటరీ నర్సింగరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు క్యాష్‌లెస్ వైద్య కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, అన్ని కేటగిరీల వారికి పదోన్నతులు కల్పించాలని, డిప్యూటేషన్‌పై వచ్చి ఎక్కువకాలం పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని, ఇళ్ల స్థలాల కేటాయింపుతోపాటు 18 డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్త

- ఉదయం పది తర్వాత ఆటలు వద్దు
- తేలికపాటి ఆహారం, సరిపడా నీరు తీసుకోవాలి


కూకట్‌పల్లి పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

కూకట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం.. వేడిగాలులు వీచడంతో చిన్నపిల్లలు త్వరగా అలసిపోవడం, వడదెబ్బకు లోనవడం వంటి సమస్య తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా బయట ఆడుకోవడం లాంటివి చేస్తుంటారు. ఉదయం పది గంటల తర్వాత పిల్లలను బయటకు పంపకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు తేలికపాటి ఆహారం అందిస్తూ సరిపడా నీరు తీసుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని చెబుతున్నారు.

లేతరంగు వస్త్రాలు ధరించాలి

ఎండలో తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే టోపి లేదా గొడుగు వాడాలి. శరీరం అంతా కప్పేలా గాలి, సోకేలా తెల్లటి నూలు వస్త్రాలు ధరించాలి. లేదా లైట్ కలర్ దుస్తులు వేసుకోవడం ఎంతో ఉత్తమం. సన్ లోషన్ క్రీములు వినియోగించాలి.

● మౌనిక, పీహెచ్‌సీ వైద్యాధికారి, మూసాపేట



వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- తప్పనిసరిగా రోజుకు రెండు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగాలి.
- సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు గ్లూకోజ్ తాగాలి.
- నీరసం, కళ్లు తిరగడం, వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కనీసం రోజుకు రెండుసార్లు స్నానం చేయాలి.
- పండ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, కర్బూజ, దోసకాయలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- కూల్‌డ్రింక్‌లు తాగొద్దు.
- ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగకూడదు.

బస్ షెల్టర్లు నిర్మించండి

పట్టించుకోని అధికారులు ● అవస్థలు పడుతున్న ప్రజలు

తిరుమలగిరి మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఆర్టీసీ) అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతరాహిత్యం వెరిసి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికుల సౌకర్యార్థం తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉన్న బస్‌స్టాప్‌లో బస్‌షెల్టర్‌ను నిర్మించాలని అధికారులను కోరినా ప్రయోజనం లేదని స్థానికులు అసహనాన్ని వ్యక్తం చేశారు. స్థానికులు సికింద్రాబాద్‌కు, ఇటు బొల్లారం వైపు వెళ్లాలన్నా తిరుమలగిరి బస్‌స్టాప్ నుంచి వెళుతుంటారు. ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు బస్సు షెల్టర్లను నిర్మించాలని కోరుతున్నారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి మొదలుకొని కొన్ని ప్రాంతాల్లో బస్‌స్టాపుల వద్ద బస్‌షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసి అధికారులు ఆదాయంపైనే కాకుండా ప్రయాణికుల సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. బస్‌షెల్టర్లు లేక వర్షాకాలం, ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాలగుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులకు బస్సు షెల్టర్లు నిర్మించాలన్న ఆలోచన కలగకపోవడం బాధాకరం అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికుల సంక్షేమంలో భాగంగా తిరుమలగిరి నుంచి మొదలుకుని బొల్లారం వరకు బస్‌స్టాపుల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



అధికారులు చర్యలు తీసుకోవాలి



తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ బస్‌స్టాపు నుంచి పలు ప్రాంతాలకు విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు సికింద్రాబాద్ బొల్లారం పరిసర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాలంటే ఎండ తీవ్రతతో అల్లాడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని అధికారులు షెల్టర్ ఏర్పాటు చేయాలి.

\- రాజారెడ్డి

బస్ షెల్టర్ నిర్మించాలి



వర్షాకాలం, ఎండాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ బస్‌స్టాప్ నుంచి వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు.

\- ఉమేష్



శ్రీగణేష్‌కు దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి: శ్రీగణేష్

సికింద్రాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు సముచిత పదవులు దక్కుతాయని స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రెండో వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్యాంసన్‌రాజుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం ఆయనను కలిశారు. తమకు పార్టీ, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. దీనికి శ్రీగణేష్ స్పందిస్తూ ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన కార్యకర్తల కఠోరశ్రమ వృథాపోదని, అన్ని వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు దరఖాస్తులు సమర్పిస్తే అందరికీ అనువైన పదవులు దక్కేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అడ్డగుట్టలో..

కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధికి పాటుపడిన కాంగ్రెస్ నాయకులకు పదవులు ఇవ్వాలని కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డు-2లోని కాంగ్రెస్ నాయకులు గురువారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే శ్రీ గణేష్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



హల్దీ ఫంక్షన్‌లో కార్పొరేటర్ దీపిక, హోమ్ నిర్వాహకులు

ఆశ్రమంలో హల్దీ వేడుక

రెజిమెంటల్‌బజార్, మే 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేకున్నా అనాథ ఆశ్రమం వారి సహాయంతో చదువుకుని, తన కాళ్లపై తను నిలబడింది. ఓ కుటుంబం ముందుకు వచ్చి ఆ యువతిని తమ కోడలుగా చేసుకోవడానికి ఇష్టపడ్డారు. గురువారం ఆ యువతి హల్దీ ఫంక్షన్ వేడుకగా నిర్వహించారు. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న సేథ్ బన్సర్‌లాల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న ఆశ్రయ రెయింబో బాలికల హోమ్‌లో పాయల్ చేరింది. ఆశ్రమంలో ఉంటూ డిగ్రీ పూర్తి చేయడంతో పాటు అప్తమాలజీలో శిక్షణ పొంది, ఓ ఆప్టికల్ సెంటర్‌లో పనిచేస్తుంది. పాయల్‌కు పెళ్లి కుదరడంతో ఆశ్రమంలో హల్దీ ఫంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఫంక్షన్‌కు అవసరమైన వస్తువులను స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక అందజేయడంతో పాటు హల్దీ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్ కోఆర్డినేటర్ గ్రేస్, ఇన్‌చార్జి సౌజన్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో కార్పొరేటర్ సునీత

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చిలకలగూడ, మే 8(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. గురువారం మెట్టుగూడ వార్డు కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ సజదా, ఇంజనీరింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీపీఐ నాయకుల సమావేశంలో పాల్గొన్న కాంపెల్లి శ్రీనివాస్

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

అడ్డగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ ఎస్టీ, బీసీ యువతకు ప్రభుత్వం అందిస్తున్న రాజీవ్ యువశక్తి సబ్సిడీ పథకానికి సిబిల్ స్కోర్ నిబంధనలు విధించడం అన్యాయమని సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గురువారం అడ్డగుట్టలోని సీపీఐ శ్రామిక భవనం కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకవైపు యువతకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించేందుకు సబ్సిడీ పథకాలను అర్హులైన వారికి వర్తింప చేస్తామని చెబుతూ మరోవైపు ఈ పథకానికి నిబంధనలు పెడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌరి నాగరాజు, కొండల్, గౌస్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

బేగంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. బేగంపేట ప్రధాన రహదారిలోని కోచర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తన సిబ్బందితో బుధవారం రాత్రి దాడి చేశారు. విషయం తెలుసుకున్న వ్యభిచార కేంద్రం నిర్వాహకులు బాలాజీ, అవినాష్, రాజు, శ్రావణి పరారయ్యారు. వ్యభిచార కేంద్రంలో పలు ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువతులతో పాటు విటుడిగా వచ్చిన సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో మహిళ అదృశ్యం



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ మహిళ అదృశ్యమైంది. సికింద్రాబాద్ రైల్వే ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా మయూర్భంజ్ జిల్లా పాలపాతి గ్రామానికి చెందిన జాదునాథ్ ముర్మ్, మలోమని ముర్ములు భార్యా భర్తలు. ఈ నెల 6న భువనేశ్వర్‌లో విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి 7న సికింద్రాబాద్‌లో దిగారు. ఇద్దరూ కలిసి ప్లాట్‌ఫాం నం.2 గేటు నం.5 వద్దకు వచ్చాక.. భార్యను ప్లాట్‌ఫాంపై ఉండమని టూత్‌పేస్ట్ తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి పది నిమిషాల తర్వాత భార్య వద్దకు రాగా ఆమె కనిపించలేదు. రైల్వేస్టేషన్‌లో గాలించినా ఫలితం లేకపోవడంతో అదే రోజు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఫలితం లేకపోయింది. మహిళ మిస్సింగ్ కేసు కింద కేసు నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

42శాతం బీసీ రిజర్వేషన్ల అమలులో పొన్నం కృషి అభినందనీయం



రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన జరిగి, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. బీసీ, గౌడ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా రావాల్సిన నిధులు, ఉద్యోగాలు, సంక్షేమ ఫలాలు అందించడానికి మంత్రి పొన్నం చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కులగణన విజయవంతం చేయడంలో మంత్రి పొన్నం చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు గణేష్‌చారి దుర్గయ్యగౌడ్, నాగేష్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, శేఖర్ సగర, కుల్కచర్ల శ్రీనివాస్‌గౌడ్, వేముల వెంకటేష్, మణిమంజరి పాల్గొన్నారు.

నేడు తాడ్‌బండ్ దేవాలయంలో హుండీ లెక్కింపు

బోయినపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి ఆలయంలో నేడు హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నరేందర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సీసీ కెమెరాలు, పోలీసుల నిఘాలో దేవాలయశాఖ అధికారులు, సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేవాలయం ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధీనంలో ఉందని భక్తులు విరాళాలు అందించాలంటే దేవాలయంలోని కార్యాలయంలో సంప్రదించి విరాళాలు అందజేసి ఖచ్చితంగా రశీదును పొందాలని కోరారు. కొంతమంది భక్తులను పక్కదారి పట్టిస్తూ దేవాలయానికి వచ్చే నిధులతో తమ జేబులు నింపుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందిందని అన్నారు. అలాంటి వారి వివరాలు తమ దృష్టికి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా భక్తులు రసీదులు పొందకుండా ఎవరికి తమ విరాళాలు అందజేయవద్దని, దాతలు ఎవరైనా ఉంటే ఆలయ కార్యాలయంలో సంప్రదించి రశీదులు పొందాలని ఆలయ ఈఓ తెలిపారు.



భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో జీహెచ్‌ఎంసీ శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్‌ను ప్రశ్నిస్తున్న పద్మశాలీ కాలనీ వాసులు

రోడ్లపై చెత్త కుప్పలు ఎత్తరా...?

అధికారులను నిలదీసిన పద్మశాలీ కాలనీవాసులు

ముషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, చెత్తాచెదారం. ఇదేనా స్వచ్ఛ సర్వేక్షణ్.. నామ్‌కేవాస్తే ప్రచారం చేస్తే ఎలా అని జీహెచ్‌ఎంసీ శానిటైజేషన్ అధికారులను భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీవాసులు నిలదీశారు. గురువారం పద్మశాలీ కాలనీలో స్వచ్ఛసర్వేక్షణ్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్‌ఎఫ్‌ఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో వారు మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయవద్దని సూచించారు. అధికారుల మాటలు విన్న కాలనీవాసులు, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే ఏమిటి అని నిలదీశారు. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తా చెదారం, చెత్తకుప్పలు కనిపిస్తున్నాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించరా అని ప్రశ్నించారు. గాంధీనగర్, పద్మశాలీ కాలనీ, భోలక్‌పూర్, పార్సిగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తున్నాయని ప్రశ్నించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే నామ్‌కేవాస్తే చేయడం కాదు, రోడ్లు, కాలనీలను శుభ్రపర్చండని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక మళ్లీ వస్తామంటూ వెళ్లిపోయారు.



కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీకాంతిలో, విద్యుత్, ట్రాఫిక్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఓల్డ్ అల్వాల్ జంక్షన్ అభివృద్ధికి కృషి

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఓల్డ్ అల్వాల్ జంక్షన్‌ను అభివృద్ధి చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ఓల్డ్ అల్వాల్ ఇందిరాగాంధీ జంక్షన్‌ను సందర్శించారు. కొన్ని దశాబ్దాలుగా జంక్షన్‌ను అభివృద్ధి చేయలన్న ప్రజల ఆకాంక్షను నేరవేర్చడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంతి, డీఈ రఘు, ఏఈ రవళి, జలమండలి జీఎం సునీల్, మేనేజర్లు కృష్ణమాచారి, రమేష్, ఏడీఈ రామాచారి, ఎలక్ట్రికల్ డీఈ సుబ్బారెడ్డి, ఏఎంహెచ్‌వో రజని, ట్రాఫిక్ సీఐ నవీన్‌రెడ్డి, హార్టీకల్చర్ విభాగం అధికారి ప్రవీణ, నాయకులు మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, నాయకులు డోలి రమేశ్, అనిల్‌కిషోర్, లక్ష్మణ్. శోభన్, పరిమేశ్, శ్రీనివాస్, అరుణ్, సురేష్, శరణ్‌గిరి పాల్గొన్నారు.

సరస్వతీ మానస పుత్రికకు సత్కారం

మారేడుపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, కస్తూర్బా గాంధీ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో కంటోన్మెంట్, మహాత్మాగాంధీనగర్‌కు చెందిన జె.నికిత ఎంపీసీలో 1000/989 మార్కులు సాధించి ప్రతిభ కనబరచింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చారుమతి గురువారం నికితని ఘనంగా సత్కరించి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అల్తాఫ్ హుస్సేన్, చైర్మన్ జి.ఉమామహేశ్వరరావు, కోశాధికారి వనం సురేందర్, లెక్చరర్లు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించినట్లు ఆమె వారికి ధన్యవాదాలు తెలిపింది.

మూగ జీవాల దాహార్తిని తీరుద్దాం

● కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి మానవత్వాన్ని చాటుదామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వెంకటాపురం వీజేఆర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు అరవింద్ మూగజీవాల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వాటిలో ఆమె, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి నీటిని నింపారు. పశువులు, పక్షులకు, కుక్కల దాహార్తిని తీర్చడానికి ఈ నీటి బౌల్స్ దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.



బస్తీవాసులతో బాణుక నర్మద

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి: బాణుక నర్మద


సికింద్రాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద చెప్పారు. రెండో వార్డులోని పైగా కాలనీ, అవంతి కాలనీల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నాలాలను, శ్రీలంక బస్తీలో చెడిపోయిన బోర్‌వెల్‌ను పరిశీలించారు. మార్గదర్శి కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాజాగా రూ.18లక్షల వ్యయంతో రెండు పైప్‌లైన్ల మధ్య అనుసంధాన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల పైగా కాలనీ, గన్‌బజార్, ఉషా గిడ్డంగులు పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని వెల్లడించారు. రెండో వార్డు బీజేపీ అధ్యక్షుడు మందుల శ్రవణ్, మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, శ్రీశైలం, చిట్టిబాబు, అల్పేష్, రాజశేఖర్, ముకేష్, మహేష్, అనిల్, పరశురామ్‌యాదవ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతించిన దక్షిణాది జేఏసీ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

తార్నాక, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నట్లు దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్చి చంపడం దారుణమన్నారు. ప్రతిదాడిగా కేంద్రం ఆపరేషన్ సిందూర్‌ను పేరుతో పాక్ ఉగ్రవాదులను హతమార్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆత్మరక్షణ కోసం యుద్ధం అనివార్యమైతే ప్రధానికి, రక్షణ దళాలకు దేశం మొత్తం మద్దతుగా నిలబడుతుందన్నారు.



నివాళులు

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందడంతో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి హబ్సిగూడలోని ఆయన నివాసంలో భౌతికకాయానికి పూలమాలతో నివాళులర్పించారు.

\- తార్నాక, ఆంధ్రజ్యోతి

భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలి

● ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి భారతదేశానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని, దళాల ధైర్యం ప్రతి భారత పౌరుడి విశ్వాసం అని, ఆపరేషన్ సిందూర్ విజయమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆప్ ఆధ్వర్యంలో సాయుధ దళాలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భారత త్రివిధ దళాల ధైర్యానికి ఆప్ నేతలు వందనాలు తెలిపారు. ఉగ్రవాదం నిర్మూలించాలి, పాకిస్థాన్ నశించాలి, భారత్ మాతాకి జై అంటూ ఆప్ నేతలు నినదించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌లో ఉగ్రవాద కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆప్ సంపూర్ణమద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావిద్, షరీఫ్, లక్ష్మనాయుడు. సుధారాణి, అజీజ్ బేగ్, షాబాజ్, సిద్దార్థ్, రెడ్డి, రమ్యగౌడ్, విశాలి, లియఖత్ ఖాన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సైనికులకు మద్దతుగా ప్రదర్శన చేస్తున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, నేతలు



సంబురాలు

బన్సీలాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రామంచ మహేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ పేరిట దేశ రక్షణకు పోరాడిన భారత జవాన్లకు అభినందనలు తెలుపుతూ మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు.

\- (పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి)



ఘనంగా సన్మానం

తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డిటెక్టివ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లను అడ్డగుట్ట డివిజన్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

\- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



జాతీయ జెండాలతో ర్యాలీ

పాక్ టెర్రరిస్టు స్థావరాలపై భారత సైనికులు చేసిన వైమానిక దాడి సమంజసమేనని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు భారత సైనికులకు సంఘీభావ సూచికంగా బోయినపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దేవేందర్, కమిటీ సభ్యులు ప్రభాకర్, రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

\- (బోయినపల్లి ఆంధ్రజ్యోతి)